నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: ఐడీపీఎల్, బేగంపేట, జనప్రియా, ఈఎస్ఐ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మూసాపేట హెచ్‌పీరోడ్డు, లక్ష్మీకళ థియేటర్ ఏరియా, శ్రీరాములు థియేటర్, అశ్విని హెయిర్ ఆయిల్ లేన్, ఎల్లమ్మ టెంపుల్ ఏరియా, బలకంపేట్, సాయిబాబా టెంపుల్, రేణుకానగర్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రేమ్‌నగర్, జనప్రియా అపార్ట్‌మెంట్స్ వెనుక వైపు లేన్, గోకుల్ థియేటర్ వెనుక ప్రాంతం, బాపునగర్, జస్టిస్ రమణ లేన్, అప్పర్ వాటర్ ట్యాంక్, ఆంధ్రాబ్యాంక్ లేన్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

ఓయూ అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్‌గా ప్రొ.కిషన్


ప్రొ.కిషన్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ అకాడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్‌గా గణితశాస్త్రం విభాగం అధ్యాపకులు ప్రొ.కిషన్ నియమితులయ్యారు. అలాగే దూరవిద్య డైరెక్టర్‌గా స్టాటిస్టిక్స్ విభాగం అధ్యాపకులు ప్రొ.భట్టాచార్యులు, సీఎఫ్ఆర్‌డీ డైరెక్టర్, ఓయూ అలూమ్ని స్పెషల్ ఆఫీసర్‌గా ప్రొ.సుజాత, బషీర్‌బాగ్ పీజీ లా కాలేజీ ప్రిన్సిపల్‌గా డా.అపర్ణ నియమితులయ్యారు. కొత్తగా నియమితులైన అధికారులకు వీసీ ప్రొ.కుమార్ నియామక పత్రాలను అందచేశారు.

ఫీజుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి


అడ్డగుట్ట: ప్రైవేట్ పాఠశాలలో ఫీజుల నియంత్రణతో పాటు యూనిఫామ్స్ , పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్న పాఠశాలలపై చర్యలు చేపట్టాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కార్యదర్శి సీహెచ్. లక్ష్మి నారాయణ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో సుమారు 60 శాతం మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారని, అందులో ప్రతి సంవత్సరం ఫీజులు విచ్చలవిడిగా పెంచుతున్నాయి. అంతే కాకుండా పాఠశాలల్లో ఎటువంటి సామాగ్రిని విక్రయించవద్దని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నప్పటికీ పాఠశాలలో యూనిఫామ్స్, పుస్తకాలు, డిజిటల్ లర్నింగ్ సామాగ్రి తమ పాఠశాలలో బ్రాండ్ ద్వారా అమ్ముతూ తీవ్ర అర్థిక బారం మోపుతున్నారన్నారు. ఇది బారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ఎ ప్రకారం హామీ ఇవ్వబడిన విద్య హక్కును ఉల్లంఘించడమే అని పేర్కొన్నారు.

శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ ప్రారంభం



లాలాపేట: ముందస్తుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ పరిధిలో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌ను చేపడుతున్నట్లు డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డి అన్నారు. బుధవారం తార్నాక డివిజన్‌లో టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్‌రెడ్డితో కలిసి డిప్యూటీ మేయర్ శానిటేషన్ ప్రత్యేక డ్రైవ్ వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. వర్షాలకు రోడ్లపై, కాలనీ, బస్తీలో వర్షం నీరు నిలుకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం


షేక్ జహీర్ (ఫైల్)

గాంధీఆస్పత్రి: వైద్యసేవల కోసం వచ్చిన మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యమైన ఘటన సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో జరిగింది. చిలకలగూడ ఎస్ఐ హముజానాయక్ తెలిపిన మేరకు.. ముషీరాబాద్ భోలక్‌పూర్‌కు చెందిన షేక్‌జహీర్ (50) కొంతకాలంగా మానసిక రుగ్మతలతో బాధపడుతున్నాడు. వైద్యచికిత్స కోసం భార్య రజియాబేగంతో కలిసి ఈనెల 9న గాంధీ ఓపీ విభాగానికి వచ్చాడు. పరీక్షించిన వైద్యులు అడ్మిట్ చేయాలని సూచించారు. షేక్‌జహీర్‌ను ఓపీ వద్ద ఉంచి, భార్య అడ్మిషన్ కోసం వెళ్లి వచ్చేలోగా షేక్‌జహీర్ కనిపించలేదు. పలు ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది.

అంగన్‌వాడీ ఆధ్వర్యంలో బడిబాట

అడ్డగుట్ట: పిల్లలను అంగన్వాడీ కేంద్రాలలో చేర్పించాలని కోరుతూ అంగన్వాడీ -2 కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం బడిబాట నిర్వహించారు. ఈ మేరకు అడ్డగుట్టలోని పలు బస్తీల్లో చిన్నారులతో కలిసి 'అమ్మ మాట - అంగన్వాడీ బాట' ర్యాలీ నిర్వహించారు.

జంక్షన్‌లో.. నో టెన్షన్

- రెండు జంక్షన్ల విస్తరణకు కసరత్తు
- చిలకలగూడ, పాటిగడ్డ జంక్షన్లపై అధ్యయనం
- నెల రోజుల్లో ప్రణాళిక సిద్ధం


సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలోని చిలకలగూడ జంక్షన్

సికింద్రాబాద్: సికింద్రాబాద్ ప్రాంతంలోని చిలకలగూడ, పాటిగడ్డ జంక్షన్‌లను విస్తరించేందుకు జీహెచ్ఎంసీ అధికారులు కసరత్తు చేస్తున్నారు. విస్తరణ, సుందరీకరణ కోసం అధికారులు అధ్యయన కమిటీని వేశారు. ఉత్తర మండలం ఇంజినీరింగ్ విభాగానికి చెందిన అధికారులు ఈ రెండు ప్రాంతాల్లో పరిస్థితులను నెలరోజుల పాటు అధ్యయనం చేయనున్నారు. ఆ మీదట రెండు జంక్షన్లలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై నివేదికను రూపొందిస్తారు.

- కొద్ది రోజుల క్రితం నార్త్‌జోన్ కమిషనర్ రవికిరణ్ నేతృత్వంలో వివిధ విభాగాల అధికారులు రహదారుల ఆధునీకరణ, అభివృద్ధి పనులు, సుందరీకరణ అంశాలపై చర్చలు చేశారు. ఇందులో సిటీ ట్రాఫిక్ పోలీసులు ఉత్తర మండలం పరిధిలో రెండు జంక్షన్ల ద్వారా ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యలను జీహెచ్ఎంసీ అధికారులకు వివరించారు.

ట్రాఫిక్ సమస్యలు...

చిలకలగూడ జంక్షన్ మీదుగా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి తార్నాక, ముషీరాబాద్, చిలకలగూడ మార్గాలకు రాకపోకలు ఉన్నాయి. పాటిగడ్డ జంక్షన్ మీదుగా సికింద్రాబాద్, బేగంపేట, మినిస్టర్‌రోడ్డు మార్గాలకు వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయి. కార్యాలయాలు, విద్యాసంస్థల పనిదినాల్లో ఇక్కడ ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యలు అదిగమించడం పోలీసులకు తలకుమించిన భారంగా మారుతుంది. జంక్షన్ మూసివేతలు, వన్‌వేల కొనసాగింపు తదితర అనేక ప్రత్యామ్నాయ పద్ధతుల ద్వారా ట్రాఫిక్‌ను కంట్రోల్ చేసే ప్రయత్నాలు చేస్తున్నా పరిస్థితి అదుపులో ఉండడం లేదు.

- లోగడ మెట్రో కారిడార్‌ల నిర్మాణం సందర్భంలోనే జంక్షన్ల విస్తరణ జరిగింది. ట్రాఫిక్ సిగ్నళ్లు కూడా ఏర్పాటు చేశారు. అయినప్పటికీ జంక్షన్‌కు అనుసంధానంగా ఉన్న రోడ్లు రుకుగా ఉన్న కారణంగా ట్రాఫిక్ సిగ్నళ్లను పూర్తిస్థాయిలో వినియోగించే పరిస్థితి లేకుండా పోయింది. ఒక్కోమారు జంక్షన్ల వద్ద ట్రాఫిక్ జామ్ సమస్యలు ఉత్పన్నం అవుతుండడంతో కిలోమీటర్ మేర వాహనాలు బారులు తీరుతున్నాయి. రెండు జంక్షన్లలో ఎదురవుతున్న సమస్యలను ట్రాఫిక్ పోలీసు అధికారులు కన్జర్వేషన్ సమావేశంలో జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తెచ్చారు.

నెల రోజుల్లో నివేదిక...

రెండు జంక్షన్లలో ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యలు అదిగమించడానికి తీసుకోవాల్సిన చర్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి నెల రోజుల్లో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జడ్‌సీ రవికిరణ్ ఆదేశించారు. ఇంజినీరింగ్ విభాగం అధికారులు ఎస్ఈ నేతృత్వంలో రెండు బృందాలుగా ఏర్పడి ఆయా జంక్షన్ల వద్ద పరిస్థితులను అధ్యయనం చేయాలని సూచించారు. మరో వారం రోజుల్లోగా రెండు జంక్షన్ల వద్ద విస్తరణ పనుల సాధ్యాసాధ్యాల పరిస్థితిని ఇంజినీరింగ్ అధికారులు అధ్యయనం చేసే పనులు ప్రారంభించనున్నారు. ఇంజినీరింగ్ అధికారులు నివేదిక వచ్చాక విస్తరణ, సుందరీకరణ పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని జడ్‌సీ తెలిపారు. రెండు జంక్షన్లలో దినదినం జటిలం అవుతున్న ట్రాఫిక్ సమస్యలకు మొత్తంగా తెరదించేందుకు ప్రణాళిక సిద్ధం చేయనున్నట్టు ఆయన తెలిపారు.

సమన్వయ సమావేశాలతో సత్ఫలితాలు



రహదారుల విస్తరణ, సుందరీకరణ ప్రధానాంశాలుగా చేపడుతున్న కన్జర్వేషన్ కమిటీ సమావేశాలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. మూడు నెలలకు ఒకమారు నిర్వహించే ఈ సమావేశాల్లో జీహెచ్ఎంసీతోపాటు జలమండలి, ట్రాఫిక్ పోలీసు, విద్యుత్ శాఖల అధికారులను భాగస్వాములను చేస్తున్నాం. నగరంలో ట్రాఫిక్ సమస్యలను అదిగమంచడం కోసం అందరి సలహాలు తీసుకుంటున్నాం. సాధ్యాసాధ్యాలు అధ్యయనం చేసి వంద రోజుల్లో సదరు అభివృద్ధి పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– జీహెచ్ఎంసీ జడ్‌సీ రవికిరణ్

శ్మశానవాటికల్లో వసతుల కల్పనకు కృషి


హిందూ శ్మశానవాటికలో షెడ్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న సదా కేశవరెడ్డి తదితరులు

రసూల్‌పురా: హిందు శ్మశానవాటికల్లో మౌళికవసతుల కల్పనకు తనవంతుగా ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యుడు సదా కేశవరెడ్డి పేర్కొన్నారు. చిన్నతోకట్టలోని జీఎం.అంజయ్య స్మారక హిందూ శ్మశానవాటికలో కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా షెడ్‌ల నిర్మాణం, హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కేశవరెడ్డి మాట్లాడుతూ తమ సదా కుటుంబంతో పాటు మాజీ ఎమ్మెల్సీ కనుకుల జనార్ధన్‌రెడ్డి కుటుంబం తరపున శ్మశానవాటికలో ప్రజలకు ఉపయోగపడే విధంగా కనీస సదుపా యాలు కల్పించనునట్లు తెలిపారు. బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్ రెడ్డి, జంపన ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సీనియర్ సిటిజన్స్ ఆత్మీయ సమ్మేళనం



సనత్‌నగర్: మోడల్‌కాలనీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో బుధవారం సీనియర్ సిటిజన్స్ ఆత్మీయ సమ్మేళనం ఉత్సాహంగా జరిగింది. జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్-17 ఉపాధ్యక్షులు జేఎస్‌టీ శాయి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎస్సార్‌నగర్, జెక్‌కాలనీ, మోడల్ కాలనీ, సుందర్‌నగర్, ఉదయ్‌నగర్, కూకట్‌పల్లి, సనత్‌నగర్, మూసాపేట తదితర ప్రాంతాలకు చెందిన సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సమాజ శ్రేయస్సు కోసం చేస్తున్న కార్యక్రమాలను ఈ సమావేశంలో ప్రస్తావించారు. ఆత్మీయ సమ్మేళనానికి అక్కినేని నాటక కళాపరిషత్ చైర్మన్ సారిపల్లి కొండల్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై పలువురు సీనియర్ సిటిజన్స్‌ను సన్మానించారు. ఇలాంటి కార్యక్రమాలు సీనియర్ సిటిజన్స్‌లో ఉత్సాహాన్ని నింపుతాయని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. మహానగరంలో ఒంటరితనానికి లోనుకాకుండా ఒకరికి తోడుగా మరొకరు అన్నట్లుగా సీనియర్ సిటిజన్స్ తరచూ కలుసుకోవడం ద్వారా వారిలో మమతానురాగాలు వెల్లివిరుస్తాయన్నారు. కార్యక్రమం నిర్వహణకు ముందుకు వచ్చి పలు ప్రాంతాల్లో ఉండే సీనియర్ సిటిజన్స్‌ను ఒక వేదిక పైకి తీసుకువచ్చేందుకు కృషి చేసిన జేఎస్‌టీ శాయిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో పార్థసారధి, ఉమామహేశ్వర్‌రావు, మాణిక్యరావు పాటిల్, జే ప్రసాద్, శ్రీరాజు, దశరథరెడ్డి, నజీర్ అహ్మద్, పూర్ణచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఫొటోలను మార్ఫింగ్ చేసి యువతికి వేధింపులు

మాజీ స్నేహితుడిపై కేసు నమోదు

వెంగళరావునగర్: స్నేహితుడు కదాని చనువుగా ఉంటే శారీరకంగా కలావలంటూ యువతిని ఒక యువకుడు వేధిస్తున్న సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... సంగారెడ్డి జిల్లాకు చెందిన యువతి స్థానికంగా నివాసం ఉంటుంది. ఆమెకు 2021లో మూసాపేటలో నివాసం ఉండే బి.హేమంత్‌కుమార్‌తో పరిచయం అయింది. కొద్దిరోజులు ఫోన్లు చేసుకుంటూ స్నేహంగా ఉంటున్న హేమంత్ తనను శారీరకంగా కలవాలని ప్రపోజ్ చేశాడు. దాంతో ఆ యువతి తిరస్కరించింది. దీనికి ఆగ్రహించిన హేమంత్ ఇరువురూ స్నేహంగా ఉన్న ఫొటోలను మార్ఫింగ్ చేసి బెదిరిస్తున్నాడు. తనతో శారీరకంగా ఉండటపోతే సోషల్ మీడియాలో పెడతానంటూ వేధిస్తున్నాడు. విసిగిపోయిన యువతి బుధవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో..) టమాటా.23, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 40, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 23, క్యాప్సికమ్ 60, పచ్చకాకర 40, పందిరి బీర 45, క్యాబేజీ 16, క్యారెట్ 41, దొండ 23, గుండుబీన్స్ 65, గింజ చిక్కుడు 55, గోకరకాయ 35, కీర 19, దోసకాయ 18, బీట్‌రూట్ 25, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 25, చామగడ్డ 35, మొరంగడ్డ 23, కందగడ్డ 45, సొరకాయ 11, పొట్లకాయ 23, అరటికాయ 11, మునగకాయ 3-4, ముల్లంగి 5-6. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

వ్యభిచార గృహంపై దాడి

అమీర్‌పేట: వ్యభిచారం గృహంపై పోలీసులు దాడి చేశారు. ఎస్ఆర్‌నగర్ పోలీసులు తెలిపిన మేరకు.. ఎస్ఆర్‌నగర్ అమీర్ ఎస్టేట్‌లో వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు దాడులు చేశారు. ముగ్గురు నిర్వాహకులు, ఇద్దరు యువతులు, ఇద్దరు విటులను పట్టుకున్నారు. విటుల్లో ఓ విద్యార్థి విజయ్‌కుమార్, పాత బస్తీకి చెందిన వ్యక్తి ఉన్నారు.

ఉత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

సనత్‌నగర్: బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణానికి రావాలని బుధవారం ఆలయ అధికారులు వెస్ట్‌మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను ఆహ్వానించారు.ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులతో ఈ నెల 14న ఆలయ ఆవరణలో సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆలయ ట్రస్ట్ చైర్మన్ సాయిబాబాగౌడ్, ఈఓ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి పరామర్శ

సికింద్రాబాద్: అనారోగ్యం బారిన పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహంకాళి జిల్లా బీజేపీ అధ్యక్షుడు భరత్‌గౌడ్‌ను బుధవారం సికింద్రాబాద్‌కు చెందిన పలువురు బీజేపీ నాయకులు పరామర్శించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.రవిప్రసాద్‌గౌడ్ నేతృత్వంలో పలువురు పార్టీ నాయకులు భరత్‌గౌడ్‌ను పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఓయూలో ఏబీవీపీ రాస్తారోకో

ఉస్మానియా యూనివర్సిటీ: పెంచిన బస్‌పాస్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ ఏబీవీపీ నాయకులు ఓయూలో బుధవారం రాస్తారోకో చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అదనంగా బస్‌పాస్ చార్జీలను పెంచడం అన్యాయమన్నారు కార్యక్రమంలో దృహన్, అలివేలి రాజు, మోహన్ బాబు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



సనత్‌నగర్: బేగంపేట ప్రకాష్‌నగర్‌లోని వెల్కిన్ పార్కు ఎదురుగా వెలసిన అక్రమ నిర్మాణాలను బుధవారం జీహెచ్ఎంసీ బేగంపేట సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. వెల్కిన్ పార్కు ఎదురుగా దాదాపు 600 గజాల స్థలంలో షెడ్లు వెలిశాయి. దీనిపై అధికారులకు ఫిర్యాదులు అందడంతో భారీ పోలీసు బందోబస్తు నడుమ టౌన్‌ప్లానింగ్ అధికారులు వాటిని కూల్చివేశారు.

మహిళ అదృశ్యం

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఓ మహిళ అదృశ్యమైంది. గోపాలపురం పోలీసులు తెలిపిన మేరకు..మెదక్‌కు చెందిన నాగేష్ భార్య, కోడలితోకలిసి ఈ నెల 11న చెన్నై నుంచి వచ్చి చర్లపల్లికి వచ్చారు.అనంతరం మెదక్‌కు వెళ్లేందుకు సికింద్రాబాద్ స్టేషన్‌కు వచ్చారు. జేబీఎస్ వెళ్లేందుకు రెతిఫైల్ దగ్గరకు రాగా వారితో పాటు ఉన్న కోడలు రోజా (21) కనిపించ లేదు. ఆమెకు కొద్దిగా మతిస్థిమితం కూడా సరిగా లేదు. చుట్టు పక్కల ప్రాంతాల్లో గాలించినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అర్హులకు డబుల్ బెడ్రూం ఇళ్లు


డబుల్‌బెడ్‌రూం లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీగణేష్.

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గంలోని నారాయణ జోపిడి సంఘం బస్తీలో అర్హులైన లబ్ధిదారులకు డబుల్‌బెడ్ రూం ఇండ్లను కేటాయించనున్నట్లు నియోజక వర్గం ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు. బుధవారం రసూల్‌పురా నారాయణ జోపిడి సంఘంలో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణ పనులను గృహ నిర్మాణ శాఖ విభాగం, సికింద్రాబాద్ రెవెన్యూ విభాగం అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్‌బెడ్‌రూం ఇండ్ల కేటాయింపులో ఇష్టానుసారంగా వ్యవహరించిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం బిల్లులు చెల్లించినా పనులు ఆలస్యం అవుతున్నాయని నాణ్యత విషయంలో రాజీ పడకుండా సకాలంలో నిర్మాణ పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. సిల్వర్ కాంపౌండ్, మారేడుపల్లి, నారాయణ జోపిడి సంఘం బస్తీలోని డబుల్‌బెడ్‌రూం ఇండ్లను అర్హులైన లబ్ధిదారులకు అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమం లో సికింద్రాబాద్ తహసిల్దార్ పాండు నాయక్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పీఎన్‌బీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు



సాక్షి, సిటీబ్యూరో: పంజాబ్ నేసనల్ బ్యాంక్ ఆధ్వర్యంలో సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ), స్వయం సహాయక బృందాల (ఎస్‌హెచ్‌జీ) కోసం బేగంపేట్‌లోని ప్రజాభవన్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. బ్యాంక్ ఎండీ, సీఈఓ అశోక్ చంద్ర బుధవారం ప్రారంభించారు. ఎస్‌హెచ్‌జి బృంద సభ్యులు, ఎంఎస్ఎంఈ వ్యాపారులు వందలాది మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్యాంకు రుణాలను పొందిన వ్యాపారుల ఉత్పత్తులతో ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీలో భాగంగా దివ్యాంగులకు, అంధులకు ఉపకరించే సేవా కార్యక్రమాలను కూడా నిర్వహించారు.

కోట నీలిమకు పలువురి అభినందన


డాక్టర్ కోట నీలిమను సత్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బన్సీలాల్‌పేట్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా నియమితులైన సనత్‌నగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమను బుధవారం రాత్రి కాంగ్రెస్ నాయకులు సత్కరించారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు ఎంపీ సునీల్, రాజశేఖర్, బాలక్రిష్ణ, రామారావు, దాస్, శివ, వినయ్, నారాయణ, జగదీష్ తదితరులు కలిసి ఘనంగా సత్కరించారు. కాంగ్రెస్ పార్టీ కోట నీలిమ సేవలను గుర్తించి రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా నియమించడం ఎంతో అభినందనీయమన్నారు.

మధ్యవర్తిత్వంతో వ్యాజ్యాలకు సత్వర పరిష్కారం

రాంగోపాల్‌పేట్: కమ్యూనిటీ మీడియేషన్ ద్వారా అనేక వ్యాజ్యాలకు సత్వర పరిష్కారం లభిస్తుందని తెలంగాణ లీగల్ సెల్ అథారిటీ సభ్య కార్యదర్శి సీహెచ్ పంచాక్షరి అన్నారు. బుధవారం సికింద్రాబాద్ ఆర్డీవో కార్యాలయంలో కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్‌ను సికింద్రాబాద్ ఆర్డీవో కార్యాలయంలోఆర్డీవో సాయిరాంతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాజ్యాల వలన చాలా సమయం వృథా అవుతుందని ఈ మీడియేషన్ కేంద్రాల్లో కౌన్సిలింగ్‌తో పాటు రెండు వర్గాలు కూర్చుని మాట్లాడుకుని సమస్యను పరిష్కరించే అవకాశం ఉందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో అడ్మిన్ ఆఫీసర్ పాల్‌సింగ్, సికింద్రాబాద్ తహసీల్దార్ పాండునాయక్, రాంగోపాల్‌పేట్ ఇన్‌స్పెక్టర్ నర్సింగ్‌రావు, కౌన్సిలింగ్ వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి


వినతి పత్రాలను సమర్పించిన బీజేపీ నాయకులు

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ నాయకులు వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులకు విజ్ఞప్తి చేశారు. డివిజన్ అధ్యక్షులు రామంచ మహేష్ అధ్వర్యంలో నాయకులు వై. సురేష్, క్రిష్ణ, శీలం శివలింగం, అమర్‌నాథ్, పరమేష్, రఘురామ్, కిరణ్‌కుమార్, శ్రీకాంత్ తదితరులు కలిసి జీహెచ్ఎంసీ జోనల్ కమీషనర్, జలమండలి జీఎంలను కలిసి పత్రాలను సమర్పించారు. ముషీరాబాద్ చౌరస్తాలో కచ్చామోరీ సమస్యను పరిష్కరించాలని, న్యూబోయిగూడ ఉప్పలమ్మ దేవాలయం సమీపంలోని పార్కును అధునీకీకరించాలని సదరు వినతి పత్రంలో పేర్కొన్నారు.

పాఠశాలల పునఃప్రారంభానికి సర్వం సిద్ధం

బన్సీలాల్‌పేట్: విద్యా సంస్థలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందు కోసం ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సర్వం సిద్ధం చేశారు. వేసవి సెలవులు ముగిసి నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో పాఠశాలలను అందుకు అనుగుణంగా తీర్చిదిద్దుతున్నారు. బోలక్‌పూర్ క్రిష్ణానగర్‌లోని మేకల మండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల, జీరా హైదర్‌బస్తీలోని గుండా ఈశ్వరయ్య ప్రభుత్వ స్మారక పాఠశాలలో ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ప్రధానోపాధ్యాయురాళ్లు స్వరూప, స్వప్నమాలలు చెప్పారు. మోండా మార్కెట్ ప్రభుత్వ పాఠశాల, ఆదయ్య స్మారక ప్రభుత్వ పాఠశాల, సున్నంబట్టీ ప్రభుత్వ పాఠశాలలో పాటు బన్సీలాల్‌పేట్, బోయిగూడ, బోలక్‌పూర్, రాణిగంజ్ తదితర ప్రాంతాల్లోని ప్రైవేట్ విద్యా సంస్థలు పాఠశాలల పున ప్రారంభానికి సర్వం సిద్ధం చేశారు. గురువారం నుంచి పాఠశాలలు పున ప్రారంభం కానుండటంతో పలు రోడ్లు విద్యార్థులతో సందడిగా మారనున్నాయి.

గాంధీ ఆస్పత్రిలో సమస్యలు పరిష్కరించండి



గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీఆస్పత్రి, మెడికల్ కాలేజీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ (డీఎంఈ) ప్రొఫెసర్ నరేందర్‌కుమార్ అధికారులను ఆదేశించారు. గాంధీఆస్పత్రి, కాలేజీలో బుధవారం ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించి పలు అంశాలపై ఆరా తీశారు. మంచినీటి సరఫరా నిలిచిపోవడంతో రోగులు, వైద్యులకు కలిగిన ఇబ్బందులను తెలుసుకుని, అండర్‌గ్రౌండ్ విద్యుత్ కేబుల్ నిర్మాణ పనులను పరిశీలించారు. గాంధీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇందిర, సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారి పాల్గొన్నారు,

పీహెచ్‌డీ సీట్ల సంఖ్య పెంచాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పీహెచ్‌డీ సీట్ల సంఖ్యను పెంచాలని ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు రిజిస్ట్రార్ ప్రొ.నరేష్ రెడ్డికి బుధవారం వినతి పత్రం ఇచ్చారు. సీనియర్ అధ్యాపకుల సేవలను వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం వర్సిటీల అధ్యాపకుల ఉద్యోగ విరమణ వయస్సును 60 నుంచి 65 సంవత్సరాలు పెంచినా ఓయూ అధికారులు వినియోగించుకోవడం లేదన్నారు. వయోపరిమితి పెంపుతో 50 మంది ప్రొఫెసర్లకు పీహెచ్‌డీ గైడ్‌షిప్ లభించిందని వారికి అవకాశం ఇస్తే సీట్ల సంఖ్య పెరుగుతాయని పేర్కొన్నారు. ఓయూలో పీహెచ్‌డీ సీట్ల ఖాళీలు 650 కాగా 5000 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైనట్లు వివరించారు. గురువారం జరిగే స్టాండింగ్ కమిటీ సమావేశంలో పీహెచ్‌డీ సీట్ల పెంపు డిమాండ్‌ను ప్రస్తవించనున్నట్లు రిజిస్ట్రార్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.